క్లుప్తంగా

గ్రామాల్లో పోలీసు బలగాల కవాతు



కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

కేవీబీపురం: మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో సోమవారం పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా తిమ్మసముద్రం, కాట్రపల్లి, రాజులకండ్రిగ, కేవీబీపురం, ఆరె తదితర గ్రామాల్లో అల్లర్లు జరిగాయన్నారు. అనేక మందిపై కేసులు నమోదు చేశామని, మరి కొందరిపై నిఘా ఉంచినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా గొడవలకు పాల్పడే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ క్రమంలో కేంద్ర పోలీసు బలగాలతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పుత్తూరు రూరల్ సీఐ భాస్కర్ నాయక్, కేవీబీపురం ఎస్ఐ షరీఫ్, ఏఎస్ఐ లోకనాథం, పీసీలు గంగాధర్, కలాం పాల్గొన్నారు.

రెండు చోట్ల వాహనాలు బోల్తా



బోల్తా పడిన లారీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తానిగిలు గ్రామం వద్ద కేటీ రోడ్డు మలుపు వద్ద అదుపుతప్పి లారీ బోల్తా పడింది. కాంపాళెం ఎస్టీ కాలనీ వద్దనున్న మలుపు సమీపంలో కారు బోల్తా పడింది. లారీలోని డ్రైవర్, క్లీనరు, కారులోని ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. లారీ, కారు దెబ్బతిన్నాయి. మలుపు వద్ద వేగ నిరోధకాలను ఏర్పాటు చేసి, ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రేణిగుంట: మండలంలో పోలీసులు నాకాబందీ నిర్వహించి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అర్బన్ సీఐ మల్లికార్జున, ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తమ సిబ్బందితో కలసి పట్టణంలోని ప్రధాన కూడళ్లు, చెక్‌పోస్ట్ ప్రాంతాల్లో వాహనాలను ఆపి విస్తృతంగా తనిఖీలు చేశారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎవరైనా అనుమానితులు హింసాత్మక ఘటనలకు పాల్పడేందుకు మారణాయుధాలను తరలిస్తున్నారా? అని ఆరా తీశారు. వాహనాలలో వెళుతున్న సామగ్రికి సంబంధించిన బిల్లులను తనిఖీ చేసి పంపారు.

ముక్కంటి ఆలయంలో రద్దీ



క్యూలను పర్యవేక్షిస్తున్న చైర్మన్ అంజూరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెలవులు కావడంతో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భక్తులు, తమిళనాడు నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. దీంతో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు క్యూల వద్ద నిలబడి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దర్శన ఏర్పాట్లు చేశారు. తాగునీరు, మజ్జిగ, క్యూల వద్ద ఫ్యాన్లు వంటివి ఉండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏకాంబరం పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరి

రేణిగుంట: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డీఈఓ శేఖర్ స్పష్టం చేశారు. రేణిగుంట ఎంఆర్సీలో సోమవారం జరిగిన కుక్ కం హెల్పర్ల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందించిన రోజువారీ మెనూ గురించి ప్రశ్నించి వంట సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. వారం రోజుల పాటు విద్యార్థులకు అందించే భోజన మెనూలో వాడే వివిధ ఆహార పదార్థాల పోషక విలువలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే రోజువారీ మెనూ గురించి వివరించి, కచ్చితంగా పాటించాలని సూచించారు. రేణిగుంట ఎంఈవో ఇందిరాదేవి, ఎంఈవో-2 రంగనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

హలం పట్టి.. పొలం దున్ని..

- కాడెద్దులకు తగ్గని ఆదరణ
- రైతు సంక్షేమ పథకాలతో భరోసా
- ఆశించిన వర్షాలతో అన్నదాతల్లో రెట్టించిన ఉత్సాహం
- గణనీయంగా పెరగనున్న సాగు విస్తీర్ణం



ముడియూరులో నాగలితో దుక్కి దున్నుతున్న రైతు



సిద్ధిరాజుకండ్రిగలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతులు

పిచ్చాటూరు : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అప్పుడప్పుడూ వర్షాలు కురుస్తున్నాయి. రైతు భరోసా కింద ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయడం, ఆర్‌బీకే కేంద్రాల ద్వారా రైతుల చెంతకే విత్తనాలు, ఎరువులు అందించడంతో మండలంలోని రైతులు వ్యవసాయ పనులను ఉత్సాహంగా చేపట్టారు. గత నాలుగేళ్ల నుంచి పంటల దిగుబడి, గిట్టుబాటు ధరలతో కాస్త ఊరట చెందిన రైతులు ఈ ఏడాది రెట్టింపు ఉత్సాహంతో ప్రత్యేక దృష్టి సారించి పంటల సాగుకు సిద్ధమయ్యారు. ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో పొలాల్లో దుక్కులు దున్నుకుంటున్నారు. గతేడాది మండలంలో ఖరీఫ్ సీజన్ సాధారణ సాగు 2,320 హెక్టార్లు కాగా 2,360 హెక్టార్లలో పంట సాగు చేశారు. రబీలో సాధారణ సాగు 1,420 హెక్టార్లు కాగా 1,440 హెక్టార్లలో సాగు చేశారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. కురుస్తున్న వర్షాలు, ప్రభుత్వ పథకాలతో రైతులు మళ్లీ ఎద్దులు కొనుగోలు చేసి సేద్యం చేసేందుకు ముందుకు వస్తున్నారు.

కూలీలకు డిమాండ్

వ్యవసాయ పనులకు కూలీల డిమాండ్ పెరిగిపోతోంది. చాలా గ్రామాల్లో రోజు కూలి రూ.250 నుంచి రూ.350 వరకు ఉంటోంది. అదే పంట ఒబ్బిడి సమయాల్లో అయితే రూ.450కు పైగా ఇవ్వాల్సి వస్తోంది. ఐదు సంవత్సరాల క్రితం వరకు సరిగ్గా వర్షాలు కురవకపోవడం, పంటలు పండేవి కాదు. దీనికితోడు ప్రభుత్వ ప్రోత్సాహం కరువుకావడంతో వ్యవసాయం గిట్టుబాటుకాక రైతులు అప్పుల పాలయ్యారు. దీంతో క్రమంగా పంట సాగు విస్తీర్ణం కూడా తగ్గించారు. మరికొంతమంది అప్పులు చేసి పంటలు సాగు చేయలేక పొలాలు బీడుగా వదిలిపెట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఐదేళ్లుగా రైతు సంక్షేమ పథకాలతోపాటు, సాగులో సాయం చేసేందుకు ముందుకు రావడంతో మళ్లీ సాగువైపు రైతులు మొగ్గు చూపుతున్నారు.

ఆర్‌బీకేలు ఎంతో ఉపయోగకరం



రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. గతంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లతో పాటు సాగుకు సంబంధించిన ఏ అవసరమున్నా మండల కేంద్రంలోని ఏవో కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఊళ్లోనే ఆర్‌బీకేలలో అన్ని పనులు జరుగుతున్నాయి. వ్యవసాయ సిబ్బంది పొలాల్లోకి వచ్చి సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

– తిరుమలరెడ్డి, పిచ్చాటూరు

ప్రభుత్వ పథకాలు భేష్



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, సున్నా వడ్డీకే రుణాలు, గిట్టుబాటు ధరల కల్పన వంటి పథకాలు రైతులకు ఎంతో ఆసరాగా ఉన్నాయి. ఈ పథకాల ద్వారా ఇప్పటికే అనేక మంది రైతులు లబ్ధిపొందారు. పంట సాగుకు ప్రోత్సాహం లభిస్తోంది. గతంలోకంటే సాగు ఖర్చులు కూడా బాగా తగ్గాయి. దీంతో మాలాంటి రైతులు మళ్లీ సాగుకు సమాయత్తమవుతున్నాం.

– స్వామినాథన్, పిచ్చాటూరు

అందుబాటులో ప్రభుత్వ సేవలు



రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు స్థానికంగానే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీకే పంపిణీ చేస్తున్నాం. దీంతో వారికి వ్యయప్రయాసలు తగ్గాయి. వ్యవసాయ పరికరాలను కూడా అందుబాటులో ఉంచాం. గతంతో పోలిస్తే ఇప్పుడు రైతులు రెట్టింపు ఉత్సాహంతో వ్యవసాయ పనులు చేస్తున్నారు. రెతులకు ప్రభుత్వం వ్యవసాయంపై భరోసా కల్పించింది.

– సంజీవరెడ్డి, ఏవో, పిచ్చాటూరు

ఉపాధి కూలీల నిరసన

వరదయ్యపాళెం: ప్రభుత్వం నిర్ణయించిన మేరకు పూడికతీత పనులు చేస్తున్నా ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యం కారణంగా తమకు గిట్టుబాటు కూలి అందడం లేదని పెద్ద పాండూరు పంచాయతీకి చెందిన వెంగారెడ్డికండ్రిగకు చెందిన ఉపాధి కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు సోమవారం వరదయ్యపాళెంలోని ఉపాధి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తక్షణమే ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని, దానికి కారణాలు చెప్పాలని కోరితే ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ‘మీకు చేతనైంది చేసుకోండి.. ఇష్టముంటే పని చేయండి.. లేదంటే ఇళ్లకు వెళ్లిపోండి.. పనులకు రానక్కర్లేదు’ అని హుకుం జారీ చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడే కూలీలకు న్యాయం చేయాల్సింది పోయి దౌర్జన్యంగా వ్యవహరించడమేమిటని ప్రశ్నించారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన ఏపీవో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



నిరసన తెలుపుతున్న వెంగారెడ్డికండ్రిగ ఉపాధి కూలీలు

నర్సరీలో త్రిదళ బిల్వ మొక్కలు



మొక్కలు నాటుతున్న పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీకి ఇటీవల నెల్లూరుకు చెందిన ఎన్వీఆర్ గ్రూఫ్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ ఆదికేశవరెడ్డి 700 త్రిదళం బిల్వం మొక్కలను అందజేశారు. వాటిని సోమవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో కైలాస సదన్ అతిథి గృహం వద్ద 200 మొక్కలు, భరద్వాజ తీర్థం వద్ద మరికొన్ని నాటారు. ఆయన మాట్లాడుతూ త్రిదళం బిల్వం అందించిన దాత ఆదికేశవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మవార్ల కృపాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు మల్లికార్జునప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవానికి సిద్ధం.. కల్యాణ వెంకన్న రథం



నారాయణవనం: ఉభయ దేవరులతో కలిసి కల్యాణ వెంకటేశ్వర స్వామి గ్రామంలో విహరించడానికి రథం సిద్ధమైంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహించనున్నారు. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న మంగళవారం వేకువ జామున 5.15 గంటలకు ఊరేగింపుగా రథ మండపానికి చేరుకుంటారని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. 6.30 గంటలకు మిథున లగ్నంలో స్వామి, అమ్మవార్లు అధిరోహించిన రథం 8.10 నిమిషాలకు కదులుతుందని తెలిపారు. సుమారు 60 అడుగుల ఎత్తైన చెక్కరథం నగరు వీధి, త్రంకురోడ్డు, మట్లవారి వీధి, కోమిటి బజారు మీదుగా గంగుంద్ర మండపం చేరుకుంటుందని పేర్కొన్నారు. భక్తుల మొక్కులు అందుకున్న స్వామి, అమ్మవారు రథంపై బయలుదేరి రథ మండపానికి సాయంత్రం చేరుకుంటుంది.

మండలానికి పాఠ్య పుస్తకాలు

ఏర్పేడు: ప్రభుత్వం నుంచి 2024-25 నూతన విద్యా సంవత్సరానికిగాను సోమవారం మండలానికి పాఠ్య పుస్తకాలు చేరినట్లు ఎంఈఓ-2 దయాకర్‌రావు తెలిపారు. మండలంలోని 6 ప్రాథమికోన్నత, 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 3,627 మంది విద్యార్థులకుగాను 15,300 పుస్తకాలు చేరినట్లు చెప్పారు. వీటిని ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గదుల్లో నిల్వచేసి త్వరలో ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు వెంకటముని, మునీశ్వర్, సురేష్, మురళి, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



లారీ నుంచి పాఠ్యపుస్తకాలు దింపుకుంటున్న ఎంఈఓ దయాకర రావు, సీఆర్పీలు

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూథి అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా సంకట చతుర్దశి పూజలు



హోమ పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద సోమవారం ఆగమోక్తంగా సంకట చతుర్థి పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ప్రతి కుటుంబం పాలుపంచుకునేలా పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

ముగిసిన చెన్నకేశవస్వామి వార్షికోత్సవాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి వార్షికోత్సవాలు సోమవారం నాటితో ముగిశాయి. ముందుగా స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. వేదమంత్రోచ్చరణల మధ్య పార్వేట ఉత్సవాన్ని వైభవంగా సాగింది. అనంతరం అశ్వవాహన సేవ నిర్వహించారు. ఇక రాత్రి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ధ్వజావరోహణంతో వార్షికోత్సవాలు ముగిశాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పార్వేట ఉత్సవానికి బయలుదేరుతున్న స్వామివారు

29, 30 తేదీల్లో గంగ జాతర





పేరంటాళ్ల వేషధారణలో పురుషులు, పురుషులకు స్త్రీల వేషాలు వేస్తున్న శ్రీనాథ్ ఆచారి (ఫైల్)

- గంగ జాతరలో తొలివేషం పేరంటాళ్లు
- తలపై కలశం, చేతిలో వేపాకుతో ఆలయ ప్రదక్షిణ
- వందేళ్లుగా సాగుతున్న ఆచారం

సత్యవేడు: ఈ నెల 29, 30 తేదీల్లో సత్యవేడులో గంగ జాతర నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ జాతరకు వందేళ్ల చరిత్ర ఉంది. ఇందులో యువకులు స్త్రీ (పేరంటాళ్లు) వేషధారణ చేసి జాతర వేషాలకు శ్రీకారం చుడతారు. ఉద్యోగం లభించిన వారు, అనారోగ్యం నుంచి కోలుకున్న పిల్లలు, కుటుంబాల్లో ఇబ్బందులు తొలగిన యువకులు, కొత్త పెళ్లి కొడుకులు పేరంటాళ్ల వేషం ధరిస్తారు. తలపై కలశం ఉంచుకుని వేపాకు చేతపట్టి గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లావు వీధుల్లో తిరుగుతూ నడివీధి గంగమ్మ ఆలయానికి చేరుకుంటారు. అక్కడ తొలిమొక్కు తీర్చుకుంటారు. తర్వాత శక్తికి ప్రతిరూపంగా భావించే గంగమ్మ దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఈ తంతు వంద సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. కరువు కాటకాలు, రోగాల నుంచి దూరం చేయాలని, ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ కులమతాలకు అతీతంగా జాతర జరుపుకుంటారు. సత్యవేడు జారతలో యువకులకు ఏ వేషం కావాలన్నా శ్రీనాథ్ ఆచారి కుటుంబ సభ్యులు వేస్తారు. వంద సంవత్సరాలుగా తాత సుబ్బరామ భత్తుడు, నాన్న మునస్వామి ఆచారి, ఇప్పుడు శ్రీనాథ్ కుటుంబ సభ్యులు యువకులకు మేకప్ చేస్తున్నారు. ఇందుకు అయ్యే ఖర్చులను కూడా వారే భరిస్తారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి





మాట్లాడుతున్న ఎంఈవో రవీంద్రనాథ్, వంటల తయారీని పరిశీలిస్తున్న ఎంఈవో మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్నం విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలని మండల విద్యాశాఖాధికారులు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. వారు సోమవారం స్థానిక ఎంఆర్సీలో మండలంలోని అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న వంట నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పీపీటీ నూతన మెనూ గురించి, వివరించి వంట పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానపాధ్యాయులు రమణయ్య, సీఆర్పీలు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఓట్ల లెక్కింపు రోజున శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి అన్నారు. రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెట్టు, బహదూరుపేట, నల్లగంగమ్మగుడి తదితర ప్రాంతాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండవ పట్టణ సీఐ రారాజు పాల్గొన్నారు.

ఓబుల్‌రాజు కండ్రిగలో గెరిగ ఉత్సవం





ఓబుల్‌రాజుకండ్రిగలో గెరిగ ఉత్సవం, అమ్మవారికి పొంగళ్లు పెట్టడానికి వస్తున్న మహిళలు

పిచ్చాటూరు: మండలంలోని ఓబుల్‌రాజు కండ్రిగ గ్రామంలో గంగ జాతరను పురస్కరించుకుని సోమవారం గెరిగ ఉత్సవం వేడుకగా నిర్వహించారు. అంతకుముందు మహిళలు గ్రామంలోని గంగమ్మ ఆలయానికి ఊరేగింపుగా చేరుకుని పొంగళ్లు పెట్టారు. అనంతరం నిర్వహించిన గెరిగ ఉత్సవంలో పసుపు నీటితో పాదాభిషేకం చేసి కర్పూర నీరాజనాలతో స్వాగతించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ కటౌట్లు, వేపాకు తోరణాలు పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి.

ఘనంగా పార్వేట ఉత్సవం

శ్రీకాళహస్తి (తొట్టంబేడు) : శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. విల్లంబులు చేతబూనిన స్వామివారు వేటకోసం గతంలో పశ్చిమదిక్కులో ఉన్న అటవీ ప్రాంతంగా ఉండే గుంటకిందపల్లె వరకు విహరించారు. సాయంత్రం ఊరందూరు చేరుకున్న స్వామివారికి వేదపండితులు, గ్రామపెద్దలు ఎదురేగి కర్పూర హారతులతో స్వాగతం పలికారు. రాత్రి ధ్వజావరోహణం నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ అశ్వవాహనంపై గ్రామోత్సవంలో స్వామివారు భక్తులకు అభయ ప్రదానం చేశారు.

సూర్యచంద్రులపై కల్యాణ వెంకన్న విహారం

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం వెలుగును నింపే దినకరుడిని, రాత్రి చల్లని వెలుగులు నింపే చంద్రుడిని వాహనంగా చేసుకుని కల్యాణ వెంకన్న గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామున 5 గంటలకు సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. 8 గంటలకు సూర్యప్రభ వాహనాన్ని విశ్వరూప దర్శనధారిగా శ్రీవారు యోగముద్రలో అధిష్టించి గ్రామంలో ఊరేగారు. అనంతరం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామి బాల గోపాలునిగా ఊంజల్ సేవలో పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై కొలువుదీరి ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్ తదితరులు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం 8.10 గంటలకు స్వామి వారి రథోత్సవం ప్రారంభమవుతుందని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. సాయంత్రం మాడ వీధిలో క్షత్రియ వేషధారుడైన శ్రీవారి అశ్వవాహన సేవ అనంతరం ఆర్జిత కల్యాణోత్సవం 8.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఆర్జిత కల్యాణంలో పాల్గొనే దంపతులు రూ.1000 చెల్లించాలని కోరారు.



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న కల్యాణ వెంకటేశ్వరుడు



చంద్రప్రభ వాహనంపై కల్యాణ వెంకటేశ్వరుడి చిద్విలాసం